క్లుప్తంగా

ఎస్పీని కలిసిన ట్రెయినీ ఎస్సైలు



మహబూబాబాద్ రూరల్: పోలీసులంటే ప్రజలపై గౌరవం పెంచేలా నూతన ఎస్సైలు విధులు నిర్వర్తించాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ట్రెయినీ ఎస్సైలు బుధవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

రూ.50వేల ఆర్థికసాయం



కేసముద్రం: మండలంలోని ఇంటికన్నె గ్రామానికి చెందిన కాడబోయిన విజయ్ అనే రైల్వే ఉద్యోగి ఇటీవల మృతి చెందాడు. ఈమేరకు బుధవారం బాధిత కుటుంబానికి మిత్రులు, తోటి ఉద్యోగులు కలిసి రూ.50వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో లాలు, వెంకన్న, బాలాజీనాయక్, శ్రీధర్, అనిల్, కుమారస్వామి, రాజు పాల్గొన్నారు.

రూ.10వేలు..

గార్ల: ఖమ్మంలో మున్నేరు వరద ఉధృతికి నీటిలో ఇళ్లు మునిగిపోయి ఇంటి సామగ్రి కొట్టుకుపోయిన సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సోమయ్యను బుధవారం మండల సీపీఎం నాయకులు కలిసి రూ.10వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, వీరస్వామి, ఈశ్వర్‌లింగం, గోవింద్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం

మహబూబాబాద్: ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బుధవారం పారిశుద్ధ్య కార్మికులకు వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నెని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, కౌన్సిలర్లు ఎడ్ల వేణుమాధవ్, పోతురాజు రాజు, జగన్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీకి విద్యుత్ మోటారు వితరణ



చిన్నగూడూరు: మండలంలోని గ్రామపంచాయతీకి డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్ మోటారుతోపాటు సామగ్రిని బుధవారం వితరణ చేశాడు. ప్రజల తాగునీటి సమస్యకు సహకరించిన కమలాకర్‌కు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పిల్లి వీరన్న, నాయకులు నర్సయ్య, శ్రీనివాస్, రమేష్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

స్తంభం షాక్ కొడుతోంది...!




గార్ల: గార్ల సమీపంలోని విజయకృష్ణ తార ఫంక్షన్‌హాలు సమీపంలో గల వరి పంటలో గల 33కేవీ ఇనుప విద్యుత్ స్తంభానికి విద్యుత్ షాక్ వస్తుందని ఫిర్యాదు చేసిన పట్టించుకునే నాథుడే కరువయ్యాడని రైతులు ఆరోపిస్తున్నారు. ఏఈ స్పందించి విద్యుత్ షాక్ రాకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరారు.

ఆదర్శంగా తీసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరనిలోటని ఆయనను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో వేణు, ప్రవీణ్, మహేష్, వినోద్, ప్రమీల, మమత పాల్గొన్నారు.

మిషన్ భగీరథ ద్వారా కలుషిత నీరు



గార్ల: మిషన్ భగీరథ పథకం ద్వారా గార్ల పట్టణంలో 4రోజుల నుంచి కుళాయిల ద్వారా కలుషిత తాగు నీరు సరఫరా అవుతుంది. దీంతో కలుషిత నీటిని తాగాలంటే ఇబ్బందిగా ఉందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇట్టి విషయంపై మిషన్ భగీరథ ఏఈ వసంత్‌ను 'సాక్షి' వివరణ కోరగా కుళాయిల ద్వారా సరఫరా అయ్యే తాగు నీటికి తనకు సంబంధం లేదని పేర్కొన్నాడు.

జీఓ 25ను రద్దు చేయాలని నిరసన



మహబూబాబాద్ అర్బన్: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



దోర్నకల్: ముల్కలపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయుల నిరసన



తొర్రూరు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ అర్బన్: జీఓ నంబర్ 25 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల మనుగడకు గొడ్డలి పెట్టులాంటిదని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు భూక్య రాంజీనాయక్ అన్నారు. బుధవారం పాఠశాలలో జీవోను ఉపసంహరించుకోవాలని నిరసన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోట్యానాయక్, నాయకులు రవి, వీరన్న, గోవర్ధన్, మధు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

దోర్నకల్: జీఓ నంబర్ 25ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు వై.సాయిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని ముల్కలపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి పూలరాజు, పెనుక స్వామి, సరస్వతి పాల్గొన్నారు.

కొత్తగూడ: జీఓను వెంటనే ఉపసంహరించుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నెల్లుట్ల భాస్కర్ డిమాండ్ చేశాడు. పొగుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విష్ణు వర్ధన్‌రావు, రమేష్, గుంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దంతాలపల్లి: జీఓ ఉపసంహరించుకోవాలని మండల కేంద్రంలో భోజన విరామ సమయంలో టీఎస్ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు రాగిరి చంద్రశేఖర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నెల్లికుదురు: జీఓ 25ను తక్షణమే ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి సైదులు పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

తొర్రూరు: ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ కోసం తీసుకువచ్చిన జీఓను సవరించాలని టీపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కొలుపుల శ్రీనివాస్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రవీణ్, రమేష్, వెంకన్న, కృష్ణ, వినీల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నోటీసులను ఉపసంహరించుకోవాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహబూబాబాద్: పేదల ఇళ్లను కూల్చొద్దని, ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా చేసి కమిషనర్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గుండ్ల కుంట కాలనీ, ఆకుల లక్ష్మయ్యనగర్ కాలనీలో 35 ఏళ్లుగా పేదలు నివాసం ఉంటున్నారని, వారికి ఇంటి నంబర్లతోపాటు ఇతరత్రా అన్ని పత్రాలు ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ చొరవ తీసుకుని ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకొని, పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజమౌళి, ఉపేందర్, యాకయ్య, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓల బాధ్యతల స్వీకరణ



కేసముద్రం: బాధ్యత స్వీకరిస్తున్న యాదగిరి



రవికుమార్, గూడూరు



లచ్చిరాం, కురవి



వీరభద్రం, గార్ల

కేసముద్రం: కేసముద్రం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓగా పెనుగొండ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కాలేరు యాదగిరి బాధ్యతలను స్వీకరించారు. అదేవిధంగా ఇనుగుర్తి మండల కేంద్రంలో ఎంఈఓగా ఇనుగుర్తి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రూపారాణి బాధ్యతలను స్వీకరించారు.

బయ్యారం: మండల ఎంఈఓగా బయ్యారం బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దేవేంద్రాచారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

కురవి: సీరోలు, కురవి మండలాలకు ఎఫ్ఏసీ ఎంఈఓలుగా నియమితులైన ఇస్లావత్ లచ్చిరాం నాయక్, వి.బాలాజీ నాయక్‌లు బుధవారం బాధ్యతలను స్వీకరించారు.

పెద్దవంగర/చిన్నగూడూరు: పెద్దవంగర జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బుదారపు శ్రీనివాస్ ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించారు. చిన్నగూడూరు మండలానికి నూతన ఎంఈఓగా ఎస్.రవికుమార్‌ను బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎంఈఓలను ఘనంగా సన్మానించారు.

గార్ల: గార్ల మండల ఎంఈఓగా మంకిడి వీరభద్రం బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.

గూడూరు: మండల విద్యాశాఖ అధికారిగా అయోధ్యపురం జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు జె.రవికుమార్‌ను నియమిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం ఆయన ఇన్‌చార్జ్ ఎంఈఓగా బాధ్యతలు చేపట్టారు.

దంతాలపల్లి: దంతాలపల్లి నూతన ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన శ్రీదేవిని, ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన ఉపాధ్యాయులు చింతల రమేష్, రాంబాబును సన్మానించారు.

ఫౌండేషన్ సేవలు అభినందనీయం



కంప్యూటర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్: ప్రభుత్వ బడుల బలోపేతం, గ్రామీణ ప్రాంతాల నిరుపేద ప్రజలను ఆదుకునేందుకు చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగస్వాములుకావాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చెర్లపాలెం, తొర్రూరు ప్రభుత్వ స్కూళ్లకు బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించిన 12కంప్యూటర్లను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మహంకాళి బుచ్చయ్య, లక్ష్మీనారాయణ, ఫౌండేషన్ ప్రతినిధులు పాడిశెట్టి కృష్ణ, ఫణికుమార్ సింహాద్రి, అమూల్యారెడ్డి, ఉత్తర శ్రావణ్, కచం వంశీ, సూర్య, నాయకులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల కమిటీ ఎన్నిక

గూడూరు: మండల కేంద్రంలోని బాలుర హైస్కూల్‌లో బుధవారం పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ ఆధ్వర్యంలో బుధవారం సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.రవిచంద్ర, ప్రధాన కార్యదర్శిగా మండల వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షుడిగా వాంకుడోతు గోపీనాథ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా సీహెచ్.అనిత, కార్యదర్శిగా గట్టు రజిత, కార్యదర్శులుగా గోపి, మనోహర్‌లను ఎన్నుకున్నారు.

దోర్నకల్: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంకా బద్రినారాయణ, సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా డి.ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శిగా రుద్ర రమేష్, అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీనివాస్, కార్యదర్శిగా ప్రదీప్, ఉపాధ్యక్షురాలిగా శేషదీపిక, కార్యదర్శిగా ఉష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జీపీ నిర్మాణానికి నిధులు మంజూరు

నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం గ్రామ పంచాయతీ కార్యాలయ పూర్తి నిర్మాణానికి ఎంపీ (రాజ్యసభ) నిధులు రూ.10లక్షలు మంజూరైనట్లు డీఈ రాంబాబు తెలిపారు. బుధవారం గ్రామంలో కార్యాలయ నిర్మాణాన్ని పీఆర్‌ఏఈ మానసతో కలిసి పరిశీలించారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్: హమాలీ కార్మికులకు ఉపాధితో కూడిన సమగ్రచట్టం, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారపు శ్రీధర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి పర్వత కోటేష్ అన్నారు. మండలంలోని కంబాలపల్లి గ్రామంలో బుధవారం వారు హమాలీలతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. హమాలీ కార్మికులకు కనీస వేతనం నెలకి రూ.26వేలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలపై ఈనెల 30న హైదరాబాదులో జరిగే మహాధర్నాకు కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు నీలం భద్రయ్య, హుస్సేన్, శ్రీరాములు, యుగంధర్, సత్యం పాల్గొన్నారు.

కోతుల బెడద నుంచి కాపాడాలి

నెల్లికుదురు: జిల్లాలోని వివిధ మండలాల్లో కోతులతో ప్రజలు, రైతులు పడుతున్న తీవ్రమైన సమస్యను పరిష్కరించాలని బీసీ రాజ్యాధికార సమితి తెలంగాణ స్టేట్ యూత్ జనరల్ సెక్రటరీ వరిపెల్లి అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కార్యదర్శి (ఐఏఎస్) లోకేష్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందించారు.

ఆదివాసీ చట్టాలకు రక్షణ కల్పించాలి

గూడూరు: ప్రభుత్వం ఆదివాసీ హక్కుల చట్టాలకు రక్షణ కల్పించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు బొల్లి సారయ్య అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ 29 శాఖల్లోని షెడ్యూల్ జీఓలను చట్టం చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు.

తహసీల్దార్‌కు వినతి

నెల్లికుదురు: రెవెన్యూ శాఖలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వీఆర్‌ఏల కుటుంబాలపై కరుణ చూపి, 61 ఏళ్లు దాటిన వీఆర్‌ఏల వారసులకు వీఆర్‌ఏలుగా నియామక పత్రాలు అందించి ఆదుకోవాలని వీఆర్‌ఏల వారసులు తహసీల్దార్ కోడిచింతల రాజుకు బుధవారం వినతిపత్రం అందించారు.

'జమిలి' ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు



మాట్లాడుతున్న అశోక్

తొర్రూరు రూరల్: జమిలి ఎన్నికల విధానం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్లం అశోక్ అన్నారు. బుధవారం మండలంలోని గుర్తూరు గ్రామంలో సీపీఎం గ్రామ మహాసభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అశోక్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కావాలని జమిలి ఎన్నికల విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. ఇలాంటి తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్‌లో సీపీఎం పార్టీ చేసే పోరాటాల్లో అన్నివర్గాల ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. సభలో నాయకులు యాకుబ్, సాయిమల్లు, యాకయ్య, ఉమ్మగాని యాకయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జయప్రదం చేయాలి

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 26న జిల్లా కేంద్రంలోని సాయంత్రం 4:30గంటలకు నిర్వహించే పెన్షన్ అక్రోష్ ర్యాలీని ఉద్యోగ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆవూనూరి రవి బుధవారం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పూసపాటి నాగమేని, నాగరాజు, రఫీక్, వీరన్న, పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల పాత్ర కీలకం

తొర్రూరు: వైద్య రంగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని తొర్రూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పగిడిపాటి సుగుణాకర్‌రాజు అన్నారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం ఫార్మసిస్టు డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ ఫార్మసిస్టు పారుపల్లి మహేశ్వర్, ఆర్‌ఎంఓ రమేష్, వైద్యులు గిరిప్రసాద్, జ్వలిత, శంకర్ పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

గూడూరు: మండల కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో నేడు (గురువారం) పలు కేసుల్లో పట్టుబడి సీజ్ చేయబడిన వాహనాల వేలంపాటను నిర్వహించనున్నట్లు సీఐ భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈవేలం పాటలో పాల్గొనే వారు నిబంధనలు పాటించాలని సూచించారు.

రుణమాఫీ డబ్బులు వెంటనే ఇవ్వాలి

కురవి: ప్రభుత్వం రైతులకు చేసిన రుణమాఫీ డబ్బులను వెంటనే ఇవ్వాలని తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం బలపాల ఏపీజీవీబీ మేనేజర్ సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు.

హరివిల్లు కార్యక్రమాన్ని సందర్శించిన ఏఎంఓ

నెల్లికుదురు: విద్యార్థుల భవిష్యత్‌కు గట్టి పునాది వేసేందుకు విద్యాశాఖ నిర్వహిస్తున్న హరివిల్లు మండల స్థాయి కాంప్లెక్స్ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ మానిటరింగ్ అధికారి ఆజాద్ బుధవారం సందర్శించి పరిశీలించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నెల్లికుదురు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ బాలరాజు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలి



మహబూబాబాద్: మానుకోట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పోలింగ్ విధుల్లో పాల్గొన్న సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు భిక్షపతి డిమాండ్ చేశాడు. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీఓ అలివేలుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రామలింగారెడ్డి, ఉపేందర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.

రక్తదానం

కేసముద్రం: అన్నిదానాల్లో రక్తదానం గొప్పదని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పీవీ ప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో రెడ్‌క్రాస్, సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 60మంది యువతీ యువకులు రక్తదానం చేశారు. కాగా 37సార్లు రక్తదానం చేసిన పానుగంటి విష్ణువర్ధన్‌ను అభినందించారు. కార్యక్రమంలో సభ్యులు రావుల రవిచందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్

గూడూరు: కూరగాయలు, ఆకుకూరలు సమృద్ధిగా తీసుకుంటే శరీరంలో రక్తహీనతను అరికట్టవచ్చని డాక్టర్ ప్రభావతి అన్నారు. మండలంలోని అప్పరాజ్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణమాసోత్సవం నిర్వహించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

గూడూరు: తెలంగాణలో గ్రామగ్రామాన బీజేపీని పటిష్ట పరిచి పార్టీ జెండా ఎగురవేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్య అన్నారు. మండలంలోని బొద్దుగొండ శివారు మల్లన్నగూడెంలోని 107 పోలింగ్ బూత్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలి

తొర్రూరు: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలో లేబర్ కోడ్ ప్రతులను దహనం చేశారు.

అరెస్ట్ చేయడం తగదు

బయ్యారం: సీఎంసీ భూమి విషయంలో అఖిల పక్ష నాయకులను పోలీసులు అరెస్ట్ చేయటం తగదని బీఆర్ఎస్, న్యూడెమోక్రసీ పార్టీల నాయకులు అన్నారు. బయ్యారం బస్టాండ్‌సెంటర్‌లో బుధవారం సాయంత్రం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీకాంత్, సత్యనారాయణ, జగన్, శ్రీను, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మరమ్మతు పనులకు రూ.5వేల అందజేత

కేసముద్రం: మండలంలోని కల్వల మోడల్‌స్కూల్‌లో బాత్రూంల మరమ్మతులకు విద్యార్థుల తల్లిదండ్రులు(ఆటోడ్రైవర్స్) కలిసి బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్‌కు రూ.5వేలను అందజేశారు. కార్యక్రమంలో అశోక్, బేతు అశోక్, గుంషావళి, సుభాష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో మేకలు, గొర్రెల వివరాల నమోదు

దోర్నకల్: మండలంలోని గ్రామాల్లో గొర్రెలు, మేకల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని మండల పశువైద్యాధికారి డాక్టర్ నాగేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని చిలుకోడు గ్రామంలో బుధవారం గొర్రెలు, మేకలకు టీకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

పెన్షన్ సౌకర్యం కల్పించాలి

కేసముద్రం: 50ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు దశ్వాయి శ్రీనివాస్ బుధవారం డిమాండ్ చేశాడు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె

కొత్తగూడ: మండలంలోని బత్తులపల్లిలో ఇటీవల దుర్గం లక్ష్మయ్య(65) పిడుగుపాటుకు మృతి చెందిన సంఘటన తెలిసిందే. కాగా లక్ష్మయ్యకు ఇద్దరు కుమార్తెలు సమ్మక్క, వెంకటమ్మ ఉన్నారు. కుమారులు లేరు. దీంతో చిన్న కుమార్తె వెంకటమ్మ బుధవారం తండ్రికి తలకొరివి పెట్టింది.

ఎట్టకేలకు తెరుచుకున్న విద్యుత్ సబ్‌స్టేషన్



సబ్‌స్టేషన్ తాళాలు తీసి చెత్తను తొలగిస్తున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

గార్ల: విద్యుత్‌శాఖ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాలతో మండలంలోని సత్యనారాయణపురం సబ్‌స్టేషన్ తాళాలు తీశారు. బుధవారం సీఈ కిషన్, ఎస్ఈ నరేష్ సమక్షంలో తాళాలు తీసి చెత్తాచెదారం, ముళ్ల పొదలను తొలగించారు. కాగా మూడేళ్లక్రితం నిర్మాణం పూర్తికాగా స్థలదాత వివాదంతో ఇన్నాళ్లు ప్రారంభానికి నోచుకోలేదు. సబ్‌స్టేషన్ ఏర్పాటుకు దాత భూమి ఇవ్వగా.. ఆయన కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తామని చెప్పారు. అయితే ఉద్యోగం ఇవ్వకపోవడంతో వారు ఇన్నాళ్లు ప్రారంభాన్ని అడ్డుకున్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవతో తాళం తీయగా.. మా సంగతి తేల్చిన తర్వాతే సబ్‌స్టేషన్ లోపలికి వెళ్లాలని స్థల దాత కుటుంబ సభ్యులు కోరారు. సీఐ రవికుమార్ జోక్యం చేసుకొని రెండు రోజుల్లో మీ సమస్యను విద్యుత్ అధికారులు పరిష్కరిస్తారని చెప్పడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా వారం రోజుల్లో సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టి అధికారికంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా ప్రారంభిస్తామని విద్యుత్ ఏఈ మహేంద్రబాబు తెలిపారు. కార్యక్రమంలో డీఈ విజయ్, ఏడీఈ రమేష్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ పటిష్టతకు కృషి చేయాలి

తొర్రూరు: బీజేపీ పటిష్టతకు పార్టీ నాయకులు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. దీన్‌దయాళ్ జయంతిని పురస్కరించుకుని బుధవారం డివిజన్ కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, రూరల్ అధ్యక్షుడు సురేష్, నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో అధ్యాపక పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ బి.సునీల్ బుధవారం తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు ఇంగ్లిష్ మీడియంలో రాజనీతిశాస్త్రం సబ్జెక్ట్ బోధించాలన్నారు. అర్హత ఎంఏ పొలిటికల్ సైన్స్, బీఈడీ ఉండాలన్నారు. ఈనెల 26న పాఠశాలలో ఉదయం 10గంటలకు అర్హత సర్టిఫికెట్లను తీసుకుని డెమో క్లాసులకు హాజరుకావాలన్నారు.

యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు..

నెహ్రూసెంటర్: జిల్లాలో 20యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శ్రవణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20 పోస్టుల భర్తీకి తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఈనెల 27న వరంగల్‌లో సెలక్షన్స్ ఉంటాయని తెలిపారు.

విదేశాల్లో ఉద్యోగాలకు..

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ టామ్‌కామ్, తెలంగాణ ప్రభుత్వంలోని కార్మిక, ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో విదేశాల్లో వివిధ కంపెనీలో ఉద్యోగ ఉపాధికి జిల్లాలోని ఐటీఐ, డిప్లమా, బీటెక్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి బుధవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 99584 83931, 79959 57779, 78935 66493 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఉరేసుకుని ఆత్మహత్య

తొర్రూరు రూరల్: మద్యానికి బానిసైన వ్యక్తి మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాటేడు గ్రామానికి చెందిన ఎనమగండ్ల సత్యనారాయణ (38) గ్రామంలో తాత్కాలిక పనులు చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. కొంత కాలంగా సత్యనారాయణ మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరచూ భార్య, భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మళ్లీ తాగడానికి డబ్బులు ఇవ్వమని భార్యను అడగడంతో ఆమె నిరాకరించింది. దీంతో మనస్తాపం చెంది మద్యం మత్తులో ఇంటి ముందు ఉన్న వేపచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శవపరీక్ష నిమిత్తం తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య యామిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.